క్లుప్తంగా

ఎంఈవోగా తాతబ్బాయి దొర

మారేడుమిల్లి: మారేడుమిల్లి మండల విద్యాశాఖధికారిగా తాతబ్బాయి దొర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వై.రామవరం మండలం ఎంఈవోగా పనిచేస్తున్నారు. మారేడుమిల్లి ఇన్‌చార్జ్ ఎంఈవోగా అధికారులు నియమించారు. ఇప్పటి వరకు ఎంఈవోగా పనిచేసిన బి.తమ్మారావు పదవీ విరమణ పొందారు.

తహసీల్దార్ రమణారావు బదిలీ

మారేడుమిల్లి మండల తహసీల్దార్ ఎ.వి.రమణరావు బదిలీ అయ్యారు. ఈయన ఏలూరు కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ బాలాజీని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అధికారులు నియమించారు.

ఆధార్ ప్రక్రియ వేగవంతం



ఆధార్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో సీతయ్య శుక్రవారం సందర్శించారు. ఆధార్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆధార్ సేవలపై గ్రామస్తులకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. అనేక చోట్ల ఆధార్ నమోదు తదతర పనులను వేగవంతం చేశామన్నారు. ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీహెచ్‌డబ్ల్యూ మృతికి సంతాపం

పెదబయలు: మండలంలో జామిగుడ గ్రామానికి చెందిన సీహెచ్‌డబ్ల్యూ మఠం కుమారి(48)అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి ఒంటి గంట మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గతకొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ, ఇతర ప్రాంతాల్లో వైద్యం చేయించుకున్నారు. అనంతరం ఆమెను స్వగ్రామం జామిగుడకు తీసుకుని వచ్చిన కొద్ది రోజుల్లోనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతికి సహచర సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

రాసవీధిలో త్రుటిలో తప్పిన ప్రమాదం



రాసవీధిలో కల్వర్టు వద్ద ప్రమాదానికి గురైన వాహనం

జి.మాడుగుల: మండలంలో కురుస్తున్న వర్షాలకు బొయితిలి పంచాయతీ రాసవీధి కల్వర్టు కోతకు గురైంది. దీంతో రోడ్డు, పైపు కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి గ్రామానికి జియో టవర్ ఏర్పాటుకు సామగ్రి తరలిస్తున్న ప్రయివేటు జీపు పైపు కల్వర్టు వద్ద ఇరుక్కుపోయింది. స్థానికులు హుటాహుటిన స్పందించి జీపు కింద బోల్తా పడకుండా తాళ్లు, కర్రల సహాయంతో రక్షణ పనులు చేపట్టారు.దీంతో జీపుకు పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామాల మధ్య ఉన్న కల్వర్టులపై బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టి వాహనరాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



మాట్లాడుతున్న సీపీఐ మండల సహాయ కార్యదర్శి అమర్

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, మురుగు సమస్య పరిష్కారం కాలేదని సీపీఐ మండల సహాయ కార్యదర్శి అమర్ ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ఉన్న డ్రైనేజీలకు ఆనుకొని ఆక్రమంగా దుకాణాలు నిర్మించడం, ఉన్న డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వర్షపు , మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో పాటు చెత్తచెదారంతో నిండిపోయిందన్నారు. దోమల బెడద ఎక్కువైందని, రోగాలు ప్రబలుతున్నాయన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని లేనిపక్షంలో పట్టణ వాసులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తగ్గని వర్షం.. భారీగా నష్టం



పనసపుట్టులో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ నోయిన, నేత తిరుపతిరావు



పెదబయలు మండలంలోని సీకరిలో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు



మంగళపాలెంలో ఇంటిపై కూలిన చెట్టు

ముంచంగిపుట్టు/అరకులోయ రూరల్ : జిల్లా వ్యాప్తంగా గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మారుమూల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కొడాపుట్టు గ్రామం గిరిజనులు అతి కష్టం మీద బైకును మోసుకుంటూ వాగును దాటించారు. చాలా ప్రాంతాల్లో గృహాలు దెబ్బతిన్నాయి. పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మండలంలోని వనుగుమ్మ పంచాయతీ దొమినిపుట్టులో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం ఒరిగింది.విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే గ్రామంలో కిల్లో సుఖదేవ్ అనే గిరిజనుడి ఇంటిగోడ వర్షానికి తడిసిపోయి దెబ్బతింది. వైస్ ఎంపీపీ భాగ్యవతి,స ర్పంచ్ మిలికలు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పనసపుట్టు పంచాయితీ టిక్రపడలో జనం ఆనందరావు ఇల్లు నేలమట్టం అయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పనసపుట్టు సర్పంచ్ జనం నోయిన ,వైఎస్సార్‌సీపీ నేత తిరుపతిరావులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.

పెదబయలు: సీతగుంట పంచాయతీ పెదబయలు గ్రామానికి చెందిన పాంగి ధనలక్ష్మీ, బొంగరం పంచాయతీ కుంటిమామిడి గ్రామానికి తల్లే లక్ష్మీ , లక్ష్మీపేట పంచాయతీ నల్లిమామిడి గ్రామానికి చెందిన నరంజీ వెంకటరావు, కుంతర్లు పంచాయతీ కుంతర్ల గ్రామానికి చెందిన అంగనైని రాంబాబు, బొర్రనేరోడి గ్రామానికి చెందిన పూజారి హరిబాబు.కిముడుపల్లి గ్రామానికి చెందిన సాగేని భవాని ఇల్లు నేలకూలాయి. మండలంలోని 7 గృహాలు పూర్తిగా కూలిపోయాయని, 31 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు తహసీల్దార్ జి.రంగరావు చెప్పారు. పరిహారం కోసం కలెక్టర్‌కు నివేదించినట్టు తెలిపారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలోని మత్స్య మాడుగులమ్మ చెరువు పొంగడంతో నీరంతా రోడ్డు పైనే ప్రవహిస్తుంది. రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. కొత్తపల్లి జలపాతం పరవళ్లు తొక్కింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పలు ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి సందడి చేశారు.

గూడెంకొత్తవీధి: దేవరాపల్లి పంచాయ తీ మంగళపాలెం గ్రా మంలో సిరిబాల చెల్లయమ్మ అనే మహిళ ఇంటిపై చెట్టు పడింది. దీంతో ఇల్లు ధంసమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరుతున్నారు.

చింతపల్లి రూరల్: పెదబరడ పంచాయతీ చిన్న గెడ్డలోని పలు వీధులు వరద ముంపులో ఉన్నాయి.



కోడాపుట్టు వద్ద బైకును మోస్తూ వాగు దాటుతున్న గిరిజనులు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు



చిన్నగెడ్డలో ఓ ఇంట్లో చేరిన వర్షపునీరు

ప్రభుత్వం తక్షణ సాయమందించాలని వినతి



ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కూనవరం: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో ప్రతీ కుటుంబానికి 25 కేజీలు బియ్యం, తక్షణ ఆర్థిక సహాయం అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, సర్పంచ్‌లు మండలానికి ప్రత్యేక అధికారి, రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరెను గురువారం కలిసి వినతి పత్రం అందించారు. వరద బాధితులకు నిత్యావసర వస్తువులు నూనె, ఉల్లిపాయలు, దొండకాయలు, ఆలుగడ్డలు ఇచ్చి సరిపెట్టిందన్నారు. గత వరదలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలప్యాకెట్లు, టమాటోలు, కిరోసిన్, టార్పాలిన్లు, బియ్యం, నూనె ఇతరత్రా నిత్యావసరాలతో పాటు బాధితులకు 25 కిలోల బియ్యం , తక్షణ సాయం కింద రూ.2000 నగదు ఇచ్చిందని వినతిలో పేర్కొన్నారు. బాధితులందరికీ సరకులు అందజేయాలని, తుపాను ప్రబావంతో కూలిపోయిన పూరిళ్లకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నిత్యావసరాల పంపిణీ సమయంలో, సహాయక చర్యల ఏర్పాటులలో స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని పీవోకు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్ నరసింగరావు

ముంచంగిపుట్టు: అన్ని శాఖల అధికారులు తుపాను దృష్ట్యా సమన్వయంతో పనిచేయాలని ఏనుగురాయి సర్పంచ్ ఎస్.నరసింగరావు అన్నారు. పంచాయతీ కేంద్రంలో సచివాలయ సిబ్బందితో తుపాను వల్ల గ్రామాల్లో పరిస్థితులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల గ్రామాల్లో గిరిజనులు పడుతున్న ఇబ్బందులు, నష్టాలపై నిత్యం తెలుసుకోవాలని, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు సరుకులు పంపిణీ చేసి ఆదుకోవాలని, గ్రామాల్లో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాద్రి, సర్వేయర్ వీరయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గంగవరం : సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఓ.భావన చెప్పారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గృహాల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని అప్రమత్తంగా ఉండాలన్నారు.

దోమతెరలు వినియోగించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని వినియోగించాలని కోరారు. అనారోగ్యమైతే ఆస్పత్రిలో చికిత్స పొందాలని నాటు వైద్యానికి దూరంగా ఉండాలన్నారు.

రెల్లలపాలెంలో తాగునీటి సమస్య



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: డౌనూరు పంచాయతీ రెల్లలపాలెంలో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై స్థానికుడు అర్జున్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ గ్రామంలో 20 పీవీటీజీ కుటుంబాలు ఉన్నాయన్నారు. గతంలో గ్రామానికి రోడ్డు వేసినపుడు పైపులైన్ దెబ్బతిందని, అధికారులు పైపులైన్ మరమ్మతు చేయలేదని దీంతో తాగునీటి సమస్య నెలకొందన్నారు. గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన బోరు సక్రమంగా పనిచేయడం లేదని ఫలితంగా గ్రామస్తులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు తక్షణమే రెల్లలపాలెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు.

వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



చినార్కూరులో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

కూనవరం: గోదావరి వరదలు ప్రజలందరికీ నష్టం కలిగించాయని ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ సున్నం అభిరామ్ అన్నారు. చినార్కూరు సచివాలయం పరిధిలో వరద బాధితులకు శుక్రవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి వరద నీరు గ్రామాలన్నింటినీ చుట్టుముట్టిందని, ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి లేనందున ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, తక్షణ సహాయం అందజేయాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసరావు, కార్యదర్శి శివమణికంఠ, విఆర్‌ఓ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రేషన్ పంపిణీ



లోతుగెడ్డలో ఇళ్లు కూలిపోయిన బాధితులకు రేషన్ సరకులు అందజేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: మండలంలోని పెదబరడ పంచాయతీ లోతుగెడ్డ గ్రామాన్ని తహసీల్దార్ టి.రామకృష్ణ శుక్రవారం సందర్శించారు. గ్రామంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని ఇళ్లు కూలిపోయి, గోడలు పడిపోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు శుక్రవారం రేషన్ సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 32 కుటుంబాలకు రేషన్ అందించినట్టు చెప్పారు. ఇందులో భాగంగా కుటుంబంలో ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున బియ్యం అందించినట్టు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రంపచోడవరం : మండలంలోని తామరపల్లి రైతు సేవ కేంద్రంలో గ్రామ సర్పంచ్ మిర్తివాడ ఆనంద రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశి హాజరైయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సభలో కౌలుదార్లు వలన పొందే లాభాలు, పంటల బీమా, గిట్టుబాటు ధరలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంటి పన్నుల వివరాల్లో మార్పుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పశు సంవర్థక శాఖ నుంచి పశువుల షెడ్లు నిర్మించుకోవడానికి రాయితీలు ఇస్తున్నారని కావలసిన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే గ్రామంలోని జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా యాంటీ లార్వా మందు పిచికారీ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు పరిశీలించారు. పిల్లలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి భారతి, వీఆర్‌వో సత్యనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ పి. బాస్కర్, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



చంద్రమ్మ(ఫైల్)

జి.మాడుగుల: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో జి.మాడుగుల పంచాయతీ వై.బి.గొందూరు అంగన్‌వాడీ కేంద్రంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న తుర్రే చంద్రమ్మ విశాఖ కెజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. చంద్రమ్మకు గుండెనొప్పి రావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించగా అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కెజీహెచ్‌కు తరలించారని, కెజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రమ్మ మృతికి ఐసీడీఎస్ సిబ్బంది, సహచరులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



నిమ్మలగూడెంలోని ఓ ఇంటిలో డ్రమ్ములోని నిల్వ నీటిని పారబోయిస్తున్న డీపీవో కొండలరావు



మర్రిపాలెంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు



కింద్ర గ్రామంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ వెంకటలక్ష్మి



రాజేంద్రపాలెంలో ఏంఎవో సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతూరు: మండలంలోని నిమ్మలగూడెంలో పారిశుధ్య కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు శుక్రవారం పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. యాంటీలార్వా స్ప్రేయింగ్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు. కుమ్మూరులో డ్రైడే సందర్భంగా డీఎల్‌పీవో రాఘవన్ వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన ప్రదేశాలను గుర్తించి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

గంగవరం : మర్రిపాలెం గ్రామంలో గ్రామ సచివాలయ కార్యదర్శి గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పారిశుధ్య పనులను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లు పరిశీలించారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రస్తుత సీజన్ అంటురోగాలు ప్రబలుతున్నాయని , ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎంపీపీ, సర్పంచ్ అన్నారు. ఎండపల్లి సర్పంచ్ బి.రామలక్ష్మి ఆధ్వర్యంలో పెద్దఅడ్డపల్లిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: కింద్ర గ్రామంలో వైద్య ఆరోగ్య, మలేరియా, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం దోమల నివారణపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో లాలం సీతయ్య అధ్యక్షతన సచివాలయ సంక్షేమ సహాయకులు, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోను విధిగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. అనంతరం ఆయన సహాయ మలేరియా అధికారి(ఏఎంవో) సత్యనారాయణతో కలిసి రాజేంద్రపాలెంలో పర్యటించి, స్థానికులకు సూచనలిచ్చారు. ఎంఈవో ఎల్.రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజ, ఈవోఆర్‌డీ కెఎస్‌వి ప్రసాద్, సీహెచ్‌వో ప్రశాంత్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో పశువైద్య శిబిరం



మేకలకు చికిత్స అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎటపాక: గోదావరి వరదల దృష్ట్యా మండలంలోని కన్నాయిగూడెంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ మహేశ్వరరెడ్డి పశువులు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి, రోగాల బారిన పడిన పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. వరదల సమయంలో పశువుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు శిశువుల తరలింపు



కవలలను 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: ఇటీవల రాజవొమ్మంగికి చెందిన పప్పుల దివ్య అనే గిరిజన మహిళ రక్తహీనత కారణంగా నెలలు పూర్తికాకుండానే తక్కువ బరువు గల కవలలకు స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం జన్మనిచ్చింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ఆదేశాల మేరకు వారిని శుక్రవారం మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ విలేకరులకు తెలిపారు. సాధారణంగా పుట్టిన పిల్లల్లో ఒకరు 959 గ్రాములు , మరో బిడ్డ 1200 గ్రాముల బరువు ఉన్నట్టు సుష్మ తెలిపారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో ఆదేశానుసారం వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా నిరుపేదలైన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సామాజిక తనిఖీపై గ్రామసభ



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీలో ఈ సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై గత వారం రోజుల నుంచి సామాజిక తనిఖీ బృందం విస్తృతం తనిఖీ నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ ఐసరం హనుమంతరావు అధ్యక్షతన గ్రామసభ సమావేశం జరిగింది. ఈ పంచాయతీలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా వాటర్ ట్యాంక్‌లు క్లీనింగ్, డ్రైనేజీ శుభ్రపర్చటం, కుళాయిల చుట్టూ పిచ్చి మొక్కలు తొలగింపు, పారిశుద్ధ్య పనుల తదితర వివరాలను సభలో ప్రస్తావించారు. పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సింహాచలం, దామోదర్, వార్డు సభ్యులు కళ్యాణం, బాలరాజు, పీసా కమిటీ అధ్యక్షుడు మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్‌ల పంపిణీ



డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాధిక

అరకులోయ రూరల్: మండలంలో కొత్తభల్లుగుడ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కొర్రా రాధిక ఆధ్వర్యంలో డస్ట్ బిన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేసేందుకు ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్‌లు అందజేసినట్టు ఆమె చెప్పారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాల్లో చెత్తాచెదరం లేకుండా గ్రామస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మూర్తి, వార్డు సభ్యులు ధర్మనాయుడు, రవి, సచివాలయం కార్యదర్శి దేవ, మహిళా పోలీస్ జ్యోతి, బలరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలో తరగతి గదుల సమస్యపై ధర్నా



ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

పాడేరు : ఎన్నికల కమిషన్ ఆధీనంలో ఉన్న పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతి గదులను తక్షణమే కళాశాల యాజమాన్యానికి అప్పగించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఐటీడీఏ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓ బ్లాకులోని తరగతి గదులను స్ట్రాంగ్ రూమ్‌ల కోసం వినియోగించారన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి రెండు నెలలు కావస్తున్నా నేటికి తరగతి గదులను యాజమన్యానికి అప్పగించలేదన్నారు. తరగతి గదులు అప్పగించకపోవడంతో కొన్ని గ్రూపుల విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాల్సి వస్తోందన్నారు. ఇటీవల నిర్వహించిన డిగ్రీ డిస్టెన్స్ పరీక్షలు కూడా వసతి గృహాల గదుల్లో నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఈనెల 29 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, తరగతి గదులు లేకపోతే విద్యార్థులు ఎక్కడ కూర్చొని పరీక్షలు రాస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించి తక్షణమే తరగతి గదులు యాజమాన్యానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు వి.కృష్ణారావు, దానియేలు, దేవదాస్, సింహాద్రి, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.